డ్రస్సు వేసుకుని జోళ్ళు టకటక లాడించు కుంటూ మాటా మంతీ లేకుండా వెళ్లిపోయారు గదూ?

ఇంట్లో వున్నంతసేపూ చిరాకు పడిపోతూవుంటారు. నా మొహం చూసే అనుకుంటాను.

అయ్యో! నా మతి మండిపోనూ - ఏదీ చంటిపిల్ల... ఎక్కడా? ఇప్పుడిక్కడ ఆడుకుంటున్నదే. ఏదీ? నా చిన్న చిన్న కాసులు? నావజ్రమాణిక్యాలూ? నా వరహాలదివ్వె? నా అపరంజి బొమ్మ - ఎక్కడ దాక్కున్నావ్? వొసి నీ... ఈ మంచం క్రింద ఏం చేస్తున్నావే? రామ్మా లాలపోస్తాను. బూడిద బుస్సమ్మ లాగున్నావు.

ఎందుకే ఆ బోసినవ్వులూ?

అక్కా - అన్నయ్యల పుస్తకాలన్నీ చింపుతున్నావా మూల కూర్చుని - వాళ్లొచ్చి ఏడుస్తారే... టైమెంతయింది చెప్మా? రేడియో కట్టేసారే.... వాళ్ళకి ఇళ్లూ వాకిళ్లూ వుండవూ ఆ రేడియో ముందు అరుస్తూ కూర్చుంటే ఇంట్లో యిల్లాళ్ళేవయి పోతారు? నాలాగే తిట్టుకుంటూ తిమ్ముకుంటూ... దిక్కుమాలిన జీవితాలు... ఆడబతుకే మధురం అన్నాట్ట ఎవడో - పిల్లలు ఈ మొగుడు ఈ సంసారం నా చుట్టూ చక్రంలా తిరుగుతోంది - నేను లేకపోతే...

అయ్యో నా మతిమండా - టిఫిన్ చేసి పెట్టడం మర్చి పోయాను. పాపం తినకుండా వెళ్లిపోయారు. కడుపులో ప్రేగులు అరుస్తాయి. దిక్కుమాలిన దాన్ని: అయితే గుమ్మటంలా ఇంట్లో కూర్చునేదాన్ని నాకెందుకు? నాకూ అక్కర్లేదు టిఫిను.... .... ....

# నా హార్మోనీ పెట్టెలో ప్రేమలేఖలు

**ఉ**త్తరం రాయడమంటే ఏమిటో బద్ధకమండీ? కలం కనిపించదు కాగితం కనిపించదు. రెండూ కనిపిస్తే పిల్లవూరుకోదు. ఈ మూకతో నా బొంద. ఉత్తరాలు రాయడంకూడా పడుతుందా? ఉత్తరాలంటే జ్ఞాపకమొచ్చింది - చిన్నప్పుడు మనం ఊరికే రాసుకునేవాళ్ళం కామూ? మొన్న హర్మనీ పెట్టెలో అట్టడుగున నా పాటల పుస్తకంలో దొరికాయి కొన్ని ఉత్తరాలు... అవి చదువుతూవుంటే మీరూ నేనూ పది పదిహేనేళ్ళ వెనక్కు వెళ్ళిపోయాం. అప్పుడు మీరు రాసిన ఉత్తరాలు ఇప్పటికీ చదువు కుంటే బాగానే అనిపించింది. పిల్లలు తీసి చూస్తారేమో కర్మ; మీ ఉత్తరం కోసం వీధిలోంచి ఇంట్లోకి, ఇంట్లోంచి వీధిలోకి తిరిగేదాన్ని. అమ్మడూ నీకు ఉత్తరం వచ్చిందే అంటూ నాన్న నామీద కవరు గిరాటు పెట్టగానే నాకు ఎలా వుండేదంటారు? ఆ ఉత్తరంలో మీరు రాసిన సంగతులు చదువుతోంటే ఎవరో మల్లెపూలు విసిరినట్లు మంచి గంధం చల్లినట్లు మనసు పరవశించి పోయేది.

నాకు బాగాజ్ఞాపకం - మీరు నాకు రాసిన మొట్టమొదటి ఉత్తరం. మా అమ్మచింపి పట్టుకొచ్చి "ఇదిగో నా మొగుడు రాశాడే" అని సింహాచలం సంపెంగి చెట్టుకు చిట్టారు కొమ్మన పూసిన పూల కోసం నిచ్చెన వేసి ఎక్కబోతున్న నాకు చదవమని ఇచ్చింది. అప్పుడు నాకుచెడ్డ గొప్పగా వుండేది. సంస్కృతం చదువుకోమని, ఉత్తరం సమాధానం రాయమని అందులోవుంది. అప్పుడు నన్ను మా అమ్మా నాన్నా దగ్గిర కూర్చొబెట్టుకొని "అతను ఏమన్నా అనుకుంటాడు బాగుండదే" అని బలవంతాన నాచేత తుడుపులూ కొట్టివేతలు లేకుండా మీకు జవాబు రాయించారు. నాకుమీరు రాసే ఉత్తరాలు కొన్నాళ్ళు మా అమ్మ చదివి నాకిస్తూ వుండేది. మానాన్న కోప్పడ్డాక మా అమ్మ నా ఉత్తరాలు చించి చదవడం మానుకుంది. "నీ మొగుడికి ఉత్తరాలు రాసుకో" అంటూ మానాన్న ఇన్ని కవర్లు తెచ్చిపడేశాడు. పెళ్ళయిన కన్నె మనసులో ఎలాంటి ఊహలుంటాయో అవన్నీ మాటలతో బొమ్మకట్టడం ఫస్టుఫారం ఫేలయిన నా వల్లనయే పనా? ఆ తరువాత మీరు రాసిన ఉత్తరాలు చూచి నేనూ జవాబులు చక్కగా రాయాలనుకుని కొట్టేసి చింపి రాసి మళ్ళీ మళ్ళీ చదువుకుని మీకు పోస్టులో వేసేదాన్ని. నాకు ప్రేమలేఖలు రాసుకునేందుకు ఓపెన్ను కొనిపెట్టారు మానాన్న.

ఆ ఉత్తరాలు కట్టలు కట్టలు పెట్టెలో బడి దొర్లుతున్నాయి. ప్రతి ఉత్తరానికి గంధమో సెంటో రాసేదాన్ని, పట్టుచీర మడతలో గుమగుమ లాడే చోట దాచేదాన్ని.జీవితం అంత గుమగుమలాడి పోవాలని నా చిన్న మనసులో ఏవో కోరికలు గూడుకట్టుకుని వుండేవి కాబోలు;

ఇప్పుడా ఉత్తరాలన్నీ ఏవి చేయడం? సాధారణంగా ఇల్లాళ్ళు తమ చిన్ననాటి ఉత్తరాలను ఏవి జేస్తూంటారు? సీరియలు నవలల్లా బైండ్లు కట్టించుగుంటారా? చింపేసి పారేస్తారా - ఒకనాడు మనసును ఎంతో మురిపించిన ఈ అజ్ఞానపురాతలు అందులోని తహతహ చిన్న తనపు కొంటె మాటలూ, వెర్రి వ్యామోహం. అవన్నీ ఇప్పుడు చదువు కుంటూంటే సిగ్గేస్తుంది మరి;మీరు పండక్కువచ్చి వెళ్లిపోతుంటే నా కళ్ళనీళ్ళు తిరిగేవి. మనం ఇద్దరమూ కలిసి హాయిగా వుండకుండా ఈపరీక్షలు చదువులు. పెద్దవాళ్ళమీద వల్లమాలిన చిరాకు కోపం వచ్చేది. మీరు నాతో డబ్బెట్టి పేకాడేవారు. గుర్తుందా? నేను మానాన్న జేబులో నుంచి డబ్బులాగేసి మీతో జూదం ఆడుతుండేదాన్ని - మానాన్న కారాకిళ్ళీలు కట్టమనేవాడు నన్ను. నేను నాలుగు కిళ్ళీలు ఆయనకు కట్టి ఇచ్చి రెండు బొడ్డులో దోపుకునేదాన్ని. అలా నాకు కారా కిళ్ళీలు వేయటం అలవాటయింది. నేను కారాకిళ్ళీ ఇప్పుడు పిల్లలు పుట్టి పెరిగాక మానేశాననుకోండి. కాని పెద్దవాళ్లకు తెలిస్తే భూకంపం వచ్చినట్టు బాధపడతారు. పాపం - నామూలకంగా మీరు కారాకిళ్ళీ నేర్చుకున్నారు. వారు వీరవుతారంటారు. ఇదే కాబోలు!

మీరు నాకు ఉత్తరాలు రాయడం నేర్పారు. నేను మీకు కారాకిళ్ళీ నేర్పాను. మీరు డబ్బు సంపాదించి తెచ్చిపడేస్తున్నారు. మీకు మీ సంతానానికీ ఇంటెడు చాకిరీ చేస్తున్నాను. మన మిద్దరం ఈ సంసారానికి జీతం భత్యంలేని నవుకర్లం.

అప్పుడునేను హాయిగా చద్దన్నం ఆవకాయా పెరుగువేసుకుతిని స్నేహితురాళ్ళతో ఆడుకుంటూ తోటలు, చెట్లూ, దేవుడిగుడి చెరువు దగ్గర తిరిగి తిరిగి వచ్చేదాన్ని. మా నాన్న

ఉమాపతీ మందుల పెట్టిలో మందుల పేర్లన్నీ నాకు కంఠతావచ్చు. నేను మందులు కట్టి వచ్చిన వాళ్ళకు ఇస్తూ వుండేదాన్ని. కాని మా నాన్న మందుకోసం వచ్చినవాళ్ళకు వేసే ప్రశ్నలు నాకు నవ్వు పుట్టిస్తూవుండేవి. ఉమాపతీ వైద్యంలో రోగం కన్నా ప్రశ్నలతో ఎక్కువ బాధపడతాడు రోగి. ఆ మందులిచ్చేముందు ఏవిటితిన్నావని అడిగి ఆ తినకూడని దేదో తిన్నందుకు రోగిని రోగి తాలూకు బంధువుల్ని బూతులు తిడుతూ వుండేవాడు మా నాన్న!

నేను మీ ఇంటి కొచ్చాక కాఫీతాగటం నేర్చుకున్నాను. మీరు నాకు పత్రికలు. కథలు చదవడం నేర్పారు. ఇప్పుడు నాకనిపిస్తుంది. మొగుడే కాపరానికి రాబోయే పెళ్ళాన్ని తీర్చిదిద్దుకునే వాడు ఆ రోజుల్లో. కాపురాని కెళ్ళటంతో ఆడ పిల్లకు నిండుతనం గౌరవం వచ్చేస్తాయి. ఇప్పటికీ, ఎప్పటికీ మొగుడే పెళ్ళాన్ని తనకు కావలసిన చక్కటి పద్ధతిలో తీర్చిదిద్దుకోవాలి. ఇందులో ఎక్కువ తక్కువ లేమిటి నా మొహం? మొగరాక్షసులూ ఆడ పీనుగులూ వుంటే వుంటారు నవలల్లో. కాని జీవితాల్లో సర్దుకుంటూ పోవాలి. ఆడా మగా అంటూ పోట్లాడుతూ కూర్చుంటే మీకర్మమీది; ఈలోగా వయసు సొగసూ మనల్నిదాటి పలకరించకుండా వెళ్ళి పోతాయి. ఈవాళేమిటిలా ఆరిందాలా పెద్ద నవలలు రాసేదానిలా మాట్లాడేస్తున్నాను?

అన్నట్లు "నా దవుటు" అలానే వుండిపోయింది. ఈ హార్మనీ పెట్టెలోని ప్రేమలేఖల్ని ఏమిచేయమంటారు? అంత సిగ్గెందుకండీ అలా వినిపించనట్టు మిమ్మల్ని కానట్టు వెళ్ళిపోతున్నారు? అయితే ఇల్లాళ్లందరూ కోర్టు దస్తావేజులు, ప్రామిసరీ నోట్లలా పెట్టి అంతా ఆక్రమించుకున్న చీరె మడతల్లోని ఈ పాత వుత్తరాలను ప్రేమలేఖల కట్టలను ఏమి చేస్తారు? బైండ్లు కట్టించి గత స్మృతుల్ని రెండు అట్టల మధ్య బంధించగలరా అని అడుగుతున్నాను.

చెప్పండి నా ప్రశ్నలకు సమాధానం?

# వెలిసిపోయిన పెళ్లిఫోటో

ఫ్రేము వూడిపోయిన పటాలుకొన్ని ఇంట్లో వో మూల పారేశాము. ఆజంకులో యీమధ్య వో వెలిసిపోయిన అట్టలాక్కొచ్చి దానికోక్లిప్పు పెట్టి పరీక్షలు రాసుకుంటున్నాడు రాము. తీరా పరీక్షగా చూద్దునుగదా. అది మన పెళ్ళి ఫోటో : వెలిసిపోయి వెలవెల బారుతూ వున్న అట్టమీద మనల నిద్దర్నీ ఒకచోట నిలబెట్టి జిగురెట్టి చెక్కు చెదరకుండా అంటించాడు ఎవడో ఫోటోగ్రాఫరు. మనమిద్దరమూ ఎక్కడికేనా పారిపోతావేమో నన్న భయంతో కాబోలు పెద్దవాళ్ళు చెంగుచెంగూగట్టిగా ముడేశారు. అందులో బుట్టబొమ్మలాగ నాకు బెనారస్ పట్టుచీరకట్టబెట్టి మెడనిండా వాళ్ళవీ వీళ్ళవీ నగలు తెచ్చి దిగేశారు. మీరు మోకాళ్ళ క్రిందకి చొక్కా తొడుక్కున్నారు.